# 'మొండోడు'

# ఆకలి

"క్రీం గ్రీం క్రీం."

పెనాన్ని రాతి పొడి మీద రాస్తున్నట్టుగా శబ్దిస్తూంది. బస్టాపు నిండా జనం. ఆవేళపుడు అందరికీ ఆ శబ్దం జలదరింపును, భయాన్ని కలుగజేస్తుంది. అది మామూలే.

"ఫట్ ! ఫట్ !! ఫట్ !!!"

కొరడా దెబ్బలు. అవీ మామూలే. సుమారుగా వేయి గజాల ఆ ప్రదేశంలో ఆ శబ్దాలు బస్టాపు మేల్కొన్న దగ్గర్నుంచీ నిద్రపోయే వరకు వినిపిస్తూ వుంటాయి. అంతటా ప్రతిధ్వనిస్తూ వుంటాయి, వచ్చీ పోయే వాహనాల హారన్ శబ్దాల్లో మిళితమవుతూంటాయి. అవి ఒక్కసారిగా ఆగితే కొందరికి హాయిగా వుంటుంది. మరికొందరికి అయోమయంగా వుంటుంది. దీపావళి రోజు టపాసులు పేలకుంటే ఎలా అన్నట్టుగా వుంటుంది. రెండు పెద్ద సైజు డాల్డా డబ్బాలకి తోలు బిగించి వెదురు బద్దలతో రంగి, మంగి వాయిస్తే వచ్చే శబ్దం.

"క్రీం గ్రీం క్రీం."

అయిదారు మొగిలి నాసల్ని పేనినట్టుండే జనపనార కొరడాతో మొండోడు కొట్టుకొంటే వచ్చే శబ్దం:

"ఫట్ ఫట్ ఫట్."

ఆ డప్పులు, ఆ కొరడా, మరో కత్తీ వాళ్ళ పనిముట్లు: దసరా పండక్కి వాటినే పూజిస్తారు. వాటిని పిల్లలకన్నా ప్రేమగా చూసుకొంటారు.

రంగికి మూడేళ్ళ కొడుకు–

మంగికి ఏణ్ణర్థం కూతురు–

మొండోడు ఇద్దరు పెళ్ళాలకి మొగుడు. ఇద్దరు పిల్లలకి తండ్రి. వాడికి నలభై యేళ్ళ వయసు ఉంటుంది. పొడుగ్గా ఉంటాడు. జుత్తు అట్టలుకట్టి ఉంటుంది. దాన్ని ముడిపెట్టుకుంటాడు. మెళ్ళో నాలుగయిదు కాశీదారాళ్ళు వేసుకుని, మొల్లో కత్తి పెట్టుకుని, నుదుటున సిందూరం దిద్దుకొని వాడు కొరడాను ఝళిపిస్తే–

చాలీచాలని చీరల్లో, చిరిగిన జాకెట్లనుండి ఒళ్ళంతా చిల్లులుగా కనిపిస్తూంటే, ఏణ్ణర్థం కూతురికి గుండెలమీద ఊయలకట్టి మంగి నిద్ర బుచ్చుతుంది. పనిలోపనిగా డప్పు వాయిస్తుంది. రంగి జత కలుపుతుంది.

మరి పిల్లాడు?

పెద్దచేలలో, కళ్ళుతేలేసి వెల్లకిలా పడుకుని ఉంటాడు. వాడి గుండెమీద కత్తికోతలు! రక్తం మరకలు! నీరసంగా కనిపిస్తాడు. కాళ్ళు, చేతులూ వేళ్ళాడిపోతుంటాయి. వాడిచుట్టూ జల్లిన బియ్యం! అక్కడక్కడా చిల్లర పైసలు! వాడిన పూలు!!

మొండోడు చేతుల మీంచి చేటను క్రిందకి దించాడు. చుట్టూ చేరిన పిల్లల్ని దూరంగా తప్పుకోమన్నాడు. పెద్దల్ని ముందుకు రమ్మన్నాడు. నృత్య భంగిమలుగా అడుగులు వేస్తూ కొరడాతో కొట్టుకొన్నారు. కళ్ళెగరేశాడు. తలని వెనక్కి వాల్చి, సూర్యుణ్ణి ముఖాముఖిగా 'ఢీ' కొన్నాడు. తలవిదిల్చి, కొరడాను రెండు చేతులోనూ పట్టి చేట చుట్టూ చేటలోనున్న కొడుకు చుట్టూ కసిగా, కర్కశంగా, వేట దొరికిన పులిలా తిరుగుతూ కొరడాను కుర్రాడి మీదికి విసిరాడు.

"ఫట్."

"అమ్మా" అని కొడుకనలేదు. బాధగా ఒళ్ళు ముడుచుకుపోలేదు. సముద్రంలోని కెరటాల్ని భయంలేక ఎదుర్కొంటున్న కొండ పలకలా నిశ్చలంగా, నిర్వికారంగా ఉన్నాడు. ఆ దెబ్బలు ఆ పిల్లాడికి తగలవనుకుంటారు చాలామంది. అయినా వాడి ఒంటిమీద జెర్రిపోతుల్లా తట్లున్నాయి.

బుసలు కొడుతున్నాడు మొండోడు. ఆయాసపడుతున్నాడు. డప్పులకూత ఆగిపోయింది.

"కత్తితో కోసేస్తాను. రక్తం తాగేస్తాను" అంటూ మెళ్ళోంచి కత్తిని తీశాడు. అక్కడ రాతిమీద ఉమ్మి, ఆ తడితో కత్తికి సానబెడుతున్నాడు. అలవాటయినా వింతగా చూస్తున్నారు జనం! గత వారం రోజులుగా జరుగుతున్నదయినా అందులోనే ఒకింత ఉద్రిక్తత! నిజంగా కోసేస్తాడా? కుర్రాడి గుండెను చీలుస్తాడా? రక్తం చిమ్ముతుందా?

మొండోడు కత్తిని సానబెడుతూ చుట్టూ ఉన్న పెద్దల్ని పరికించి చూశాడు. పదేపదే చూశాడు.

అలా చూస్తున్నప్పుడు వాడి కళ్ళు ఎర్రగయినాయి. కింది పెదవిని పంటి క్రింద నొక్కిపెట్టి కరుచుకున్నాడు. చిన్నగా చిట్లింది. రక్తం రుచి చూడకుండా వెంటనే పెదవుల్ని విదిల్చి ఉమ్మేశాడు. వాడికి కావాల్సిన రక్తం వేరు.

వెచ్చవెచ్చగా....

చిక్కచిక్కగా....

ఉప్పుప్పగా.......

ఉండే రక్తం కావాలి!

ఆ రక్తం దొరుకుతుందా? దొరికితే దోసిళ్ళతో తాగాలని ఉంది వాడికి. దాని కోసమే ఊళ్ళన్నీ తిరుగుతున్నాడు. ఊరూరా తిరుగు

తున్నాడు. అయినా ఫలితం లేకపోతోంది.

కత్తిని నూరి నూరి అంచుపదును తేలేలా చేశాడు. ఎడమ చేత్తో పట్టుకొని, కుడిచేతి చూపుడు వేలితో అంచును రాస్తూ పరీక్షించాడు. "సర్"న తెగింది. వేలిపై గోరింటపంట! లేచాడు. కత్తిని తిప్పుతూ దాని కొనను కుర్రాడి గుండెమీద ఆన్చాడు. ఇంతకు ముందు కోతల వల్ల గుండెలమీది రక్తంపెచ్చుళ్లా, పెళుసులుగా గడ్డకట్టి వేస్తూంది.

ఇవుడు మళ్ళీ....

"కన్న కొడుకు బాబులూ! కత్తికి బలి చేస్తున్నాను బాబులూ! కనికరించు బాబులూ" గుండెను చరుచుకొంటూ ముష్టి అడిగాడు మొండోడు.

డప్పులు గుండెల్ని బాదుకొంటున్నాయి. ఇచ్చిన వాళ్ళు అయిదు పది పైసలిస్తున్నారు. ఇవ్వనివాళ్ళు 'వెళ్ళు వెళ్ళ' మన్నట్టుగా చేతి సౌంజ్ఞలు చేస్తున్నారు. అయిదు నిముషాలు గడిచాయి. మూడు బస్సులు వచ్చి అటుగా ఆగాయి. మరో కారు! జనం దిగుతున్నారు. చేట పట్టుకొని పరుగెత్తాడు మొండోడు వారి వెంట—

అతని వెంటనే సిరి, శంకు, చక్రముల్లా....

డప్పులు! రంగి! మంగి!

మళ్ళీ ఆట మొదలు. వాడి చూపు మొదలు. అలా అక్కడ, ఇక్కడ, అక్కడక్కడా ఆడాడి జనం పల్చబడిన వేళకి, సాయంత్రం ఏడు గంటల వేళకి అలసిపోయాడు.

"లేవరా బాబూ" చేటలోని కొడుకుని లేపాడు. ఆ మాట అన్నది తడువుగా లేచాడు



కొడుకు వెళ్ళి రంగిని వాదేసుకొన్నాడు.

"ఆకలేస్తూందమ్మా! బువ్వెట్టవూ" అనడిగాడు.

"కాసేపాగు" అంది రంగి.

-బస్టాపుకి వెనగ్గా, ఏదో ఫ్యాక్టరీ ప్రహరీ గోడకి ఆనలగా చేరుకొన్నారు. అక్కడ, మంగి చితుకులు చేర్చి వంట చేస్తూంది. రంగి సాయం చేస్తూంది. మొండోడు దూరంగ బీడీ తాగుతూ కూర్చున్నాడు. వాడి భుజాలు మీది కెక్కి కొడుకు గుర్రం ఆట ఆడుతున్నారు' పసిది నేలపై పొర్లుతూంది.

"రేపు విసాపట్నం ఎళ్ళిపోదామంటున్నాడు బావ" అంది రంగి, మంగితో.

"ఆడిష్టం! ఎక్కడికి రమ్మంటే అక్కడికే. సొంసానానికయినా సిద్ధం" గాలికి పొయ్యిలోని మంట చీలికలవుతూంది. నేలనుండి లేస్తూన్న రక్తం దారికల్లా మంటలు!

-మొండోడు మంటల్ని చూస్తున్నాడు. మండిపోతున్నాడు. లోలోపలి మంటలు వాడి గుండెను మరిగిస్తున్నాయి. నరాల్ని కమిలిస్తున్నాయి. క్రింద పడక రెప్పల మాటున కళ్ళలో సుళ్ళు తిరుగుతూ నీళ్ళు. ఎవరికీ కన్పించక ఏడుస్తున్నాడు. ఈ బ్రతుకింతేనని ఏడుస్తున్నాడు. దీనికి తుది ఎప్పుడని ఏడుస్తున్నాడు.

కత్తికి కార్యం సిద్ధిస్తుందా?

కసికి ఫలితం లభిస్తుందా అని భోరుభోరున ఏడుస్తున్నాడు. గోలు గోలున ఏడుస్తున్నాడు. అలా తనలో తనే ఏడ్వడం మొండోడికి చాలా చిన్న వయసు నుండే అలవాటయింది. కాదు, అలవాటు చేసుకున్నాడు.

ఎనిమిదేళ్ళ వయసులో....

పలక, బలపం చేతబట్టి స్కూలుకి వెళ్తూన్న రోజుల్లో, అన్నంతోగాక కథలు, కబుర్లూచెప్పి ఆకలిని అమ్మ జోకొట్టే దినాల్లో—

ఓ రోజు—

పాక ముందు నుంచి కారువెళ్తూంది. అందులో పచ్చగా, పసిడి బొమ్మలా ఉన్నాయన్ని అమ్మ చూసింది.

అదే నవ్వు....

ఆవేళ్ళు....

అదిచేదిగో అదే ఒంటిపేట గొలుసు....

ఆయన! ఆయనేనంటూ పరుగు తీసింది. తీసింది. "ఏమండీ, ఏమండీ" అని వెంటపడింది. ఆయన కార్లోనుండే తలను వెనక్కి తిప్పి వెనుక అద్దాల్లోంచి వెనక్కి వెనక్కి చూశాడు. అమ్మ పరుగునుచూశాడు. పలుకుని విన్నాడు. ఆపకుంటే గొడవవుతుందేమోనని, కారునాపుజేసి కిందికి దిగాడు.

"ఎవరు నువ్వు! ఏం కావాలి" అనడిగాడు.

"నేనండీ! నేనండీ" అమ్మ ఏడుస్తూంది.

"ఎందుకు పిలిచావు?"

అమ్మ అతన్ని చూస్తూ మాట్లాడ లేకుంది.

"నీకూ నాకూ సంబంధం ఏమిటి?" అడిగా-

# చెమట వ్యాపారం



నీ శ్రమ ఫలం
నీ సమక్షంలోనే
పాతి పెట్టిన విత్తనం
దాన్ని
ఫల్లు చెట్టుగా పెంచి
దక్కించుకున్నవాడిదే పెత్తనం

-అలిశెట్టి ప్రభాకర్

డాయన. ఆసరికే గుంపుగా చేరారు జనం. పాకలోని మనిషి కారువాణ్ని పలకరించడమా ఆశ్చర్యపోతున్నారు. ఆయన కళ్ళు అమ్మని తినేసేటట్లు చూస్తున్నాయి. అయినా చుట్టూచేరిన జనాన్ని చూసి సన్న సన్నగా నవ్వుతున్నాడు. ఆ నవ్వు అమ్మని మింగేసేటట్టుంది. అమ్మ వణికి పోతూంది. చేతు రెండూజోడించి మొక్కుతూంది. గుచ్చిగుచ్చి చూస్తూన్న జనాన్ని చూసి విలవిల్లాడుతోంది.

"చెప్పు! నీకూ నాకూ ఏమిటి సంబంధం" రెట్టించాడాయన.

"తాళి సంబంధం" అంది అమ్మ. ఆ మాటతో అమ్మకి ఎక్కడలేని బలమూ వచ్చింది. ఆయన్లో ఉన్న బలం ఎక్కడికో వెళ్ళి పోయింది. నవ్విన వాళ్ళు నవ్వారు. విస్తుపోయిన వాళ్ళు విస్తుపోయారు.

"నన్ను ప్రేమించానన్నావు. పెళ్ళి చేసుకొంటానన్నావు. కానరాకుండా పోయావు" అంది.

ఆయన దిక్కులు చూశాడు.

"దిక్కులేని దాన్ని చేరదీసి మరింత దిక్కుమాలిన బతుకు చేశావు. నీ పెళ్ళాన్ని నేను. నా బాబుని తండ్రివి నువ్వు. సాక్ష్యాలు, ఆధారాలు కావాలంటే మన ఊరి మురికివాడల్ని అడుగు, కలిసి పడుకొన్న మీ గెస్ట్‌హౌస్ మంచాన్ని అడుగు. దాని కాపలాకుక్కనొకర్ని అడుగు."

"నోర్మూయ్" గర్జించాడాయన.

"నీకు పెద్దింటి పిల్లతో పెళ్ళయి, పెద్ద కట్నంతో ఆవిడ వస్తూందని ఆభాసు జేసి అల్లరి పాలు చేయొద్దని, అంతా సద్దుమణిగాక కొద్ది కాలంలో నన్నేలుకొంటానని లాలనగా చెప్పినాడు, నోరు విప్పకని అడిగినాడు, నోరు మూసుకున్నాను. నీకు పిల్ల పుట్టింది, నాకు బాబు పుట్టాడు. ఆ విషయం నీకు చెప్పి 'ఇంకెంత కాలం' అని అడిగినాడు, 'మరి కొద్ది కాలం' అంటూ ప్రేమగా నోరు నొక్కావు. అప్పుడూ నోరు మూసుకున్నాను. తర్వాత తర్వాత నేనెక్కడ నోరు విప్పుతానోనని రౌడీలతో ఊరుకాని ఊరుకు తరలించినప్పుడు భయంతో నోరు పెగలక ఊరుకున్నాను. అప్పట్నుంచీ ఇప్పటి వరకు గత ఎనిమిదేళ్ళుగా నువ్వు చెప్పినట్టుగా నోరుమూసుకునే వున్నాను. ఇప్పుడు మళ్ళీ నోరు మూసుకో మంటావురా పుండాకోర్.'

అమ్మ ఆయన షర్ట్ పట్టుకుంది. గింజుకున్నాడు. జనం విడదీసే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో ఆయన కారెక్కి పారిపోతే అమ్మొక్కర్తీ ఆ రోడ్డుమీద ఏకాకిలా నిల్చుండి పోయింది.

"ఆ రాత్రే....

ఆ ఏకాకిని—

ఆయన మళ్ళీ వచ్చి పలకరించాడు.

"ఇక సమస్య లేదన్నాడు. బుజ్జగించాడు. అప్పుడు అమ్మ ఏడు వారాల నగలు పెట్టుకొన్నట్టుగా మురిసిపోయింది. ఏడేడు జన్మలెత్తినట్టుగా ఆనందించింది. ఆనందంలో....

"బాబూ! మీ నాన్నారే" అని అమ్మ అంటూంటే, ఆ నోటి నుంచి ఆ మాటలింకా పూర్తికాక ముందే 'కన్న' అమ్మ పొత్తికడుపులో కత్తి దిగింది. ఫిల్టర్‌తో చిమ్మినట్టుగా రక్తం ఇంటినిండా పడింది. కుంచెతో నిలువు గీతలు గీసినట్టుగా దారికలు కట్టింది.

చచ్చిన అమ్మను వదిలేసి, తనని వదిలేసి పచ్చని నాన్న, పసిడి రంగు నాన్న, ఒంటిపేట గొలుసు వున్న నాన్న పారిపోయాడు. మళ్ళీ కన్పించలేదు. అమ్మని హత్య చేసింది ఎవరన్నది పోలీసులకి అంతుపట్టనట్టే, నాన్న అంతూ ఇంత వరకూ లేలేదు. ఎక్కడ ఉన్నాడో? ఏ మూలన దాగున్నాడో? ఎన్ని నోట్ల కట్టలని అడ్డు పెట్టుకొని కన్పించకున్నాడో, మొండోడికి తెలియడం లేదు.

బ్రతికి ఉన్నాడో!

చచ్చాడో!

—రెండో ఆలోచనను భరించలేకున్నాడు. బ్రతికే వుండాలి. లేకపోతే ఎలా? అనుకున్నాడు మొండోడు. కత్తికి కార్యం సిద్ధించక పోతే ఎలా! కసి తీరకపోతే ఎలా?!

"అయ్యో బువ్వకు రావే" అన్నాడు కొడుకు. మొండోడు లేచి నడిచాడు.

రేపు విశాఖపట్నం,

ఎల్లుండి బెజవాడ,

ఆవతల్నాడు గుడివాడ, అలా వాడవాడలా మొండోడు తిరుగుతూ ఉంటాడు. కసిని చంపుకోడు. కత్తికి పదును పెట్టకా మానడు. ●